ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక: 30-5-1990

# భ్రాంతి

నేనా ఊరు వెళ్ళేసరికి చీకటి పడుతున్నది. ఊళ్ళో కూడలి దగ్గర కారాపి -

"పద్మనాభం..... హైస్కూల్లో పనిచేసి రిటైరయ్యారు. వారింటికి దారెటూ?" అనడిగా!

"పద్మనాభమా!" అని నలుగురైదుగురు ఆలోచించి, సమాధానం చెప్పేలోగా ఓ కుర్రాడు, "నే చూపిస్తా రాండి" అని ముందుకొచ్చాడు.

కారెక్కించుకున్నా.

మట్టి రోడ్లు.

నిశ్శబ్దంగా, నిస్తేజంగా ఉన్న ఇళ్ళు, వీథులు. కారు వెడుతుంటే దుమ్ము. కారును వింతగా చూస్తున్న జనం.

సందులు, గొందులు తిరిగి, ఊరి బయటగా ఉన్న ఓ రెల్లుపాక ముందు కారాపాను.

"మీరుండండి! సారున్నారేమో చూసొస్తా!" కుర్రాడు దిగి వెళ్ళాడు.

ఆ ఊరును చూస్తుంటే, మనుషులను పరిశీలిస్తే - 'ఇక్కడ మనుషులు ఎలా బ్రతుకుతున్నారో' అన్న అనుమానం వేసింది.

"పద్మనాభంగారిని చూసి వెళ్ళిపోతే, రాత్రికి టౌన్‌లో ఏదైనా లాడ్జీలో ఉండొచ్చు" అని తీర్మానించుకున్నా.

"ఉన్నారు సార్! మిమ్మల్ని రమ్మంటున్నారు."

కారు అద్దాలన్నీ మూసి, డోర్ లాక్ చేశా. కుర్రాడు కారునీ, నా సూట్‌ని, కళ్ళద్దాల్నీ వింతగా చూస్తుంటే నవ్వొచ్చింది. ఓ రూపాయి నోటు తీసి ఇచ్చా ఆ కుర్రాడికి. దారి చూపినందుకు!

"వద్దుసార్!" నోటు తీసుకోకుండా జారిపోయే నిక్కరును ఎగలాక్కుంటూ చీకట్లో, దుమ్ములో పరిగెట్టుకుంటూ వెళ్ళాడు.

డబ్బంటే వాడికి గల నిర్లక్ష్యానికి ఆశ్చర్యమేసింది. వాడికి నిజంగా డబ్బక్కరలేదా? లేక, లేమిలోనే ఆనందం ఉందా? అర్థం కాలేదు.

నా కోసం పద్మనాభంగారే వచ్చారు.

కళ్ళకు దళసరి అద్దాలు. నున్నగా, కంచు చెంబులా బట్టతల, మొలకో పాత పంచె, పైనేమీ ఆచ్ఛాదన లేదు.

ఈయనా రమేష్ తండ్రి? ఆశ్చర్యమేసింది.

"ఎవరు బాబూ మీరు?" పద్మనాభం అడిగాడు.

నా పేరు చెప్పా.

"అమెరికా నుంచి పదిహేను రోజులనాడు వచ్చాను. మీవాడు తప్పకుండా వెళ్ళి మిమ్మల్ని చూసి రమ్మంటే వచ్చా."

"రాండి" లోపలకు దారి చూపించారు పద్మనాభంగారు.

తలకు వాకిలి తగలకుండా వంగి లోపలికి వెళ్ళాను.

పద్మనాభంగారు ఓ పాత కొయ్యకుర్చీ చూపించి కూర్చోమన్నారు. కూర్చున్నా.

అప్పుడు చూశాను, ఆ గదిలోనే దేవుడి పటాలు, పూజా స్థలం ఉండటం!

"క్షమించండి. బూట్లు బయట విప్పేసి వస్తాను."

పద్మనాభం మాట్లాడలేదు. బూట్లు, సాక్స్ విప్పి అరుగుపై పెట్టాను. మెత్తటి పాదాలకు మట్టి గుచ్చుకుంది. ఆ అనుభూతి తమాషాగా అనిపించింది.

మళ్ళీ లోపలకు వెళ్ళాను.

"బాబూ! మంచి తీర్థం కావాలా?"

రాగి గ్లాసు, కంచు మరచెంబుతో పద్మనాభంగారి భార్య సుబ్బాయమ్మ నిలబడి వుంది.

"వీరే, మనబ్బాయి స్నేహితుడు" - పద్మనాభంగారు పరిచయం చేశారు.

"నమస్కారం" అంది ఆవిడ - పెద్ద ముత్తయిదువు.

రాగి గ్లాసుతో నీళ్ళు తీసుకున్నా గానీ త్రాగడమా, మానడమా అని క్షణం ఆలోచించాను. ఎందుకంటే, ఇక్కడ నీళ్ళు నాకు జబ్బు చేస్తాయామోనన్న అనుమానం. కారులో నీళ్ళు తెచ్చుకున్నాను. అవి తెచ్చుకుంటే వీళ్ళు బాధపడతారేమో? మనసు రాయి చేసు

కుని, రాగి గ్లాసులో నీళ్లు గొంతులో పోసుకున్నాను.

"కృష్ణ నీళ్ళు. తాగండి, వంటికి మంచిది" పద్మనాభంగారన్నారు అభయమిస్తూ.

గొంతులోంచి కడుపులోకి జారిన నీళ్ళు చల్లగా, తియ్యగా ఉన్నాయి. ఒళ్ళంతా ఒక్కసారి ఝల్లుమంది.

సుబ్బాయమ్మగారు పీట వాల్చుకు కూర్చుంది. పద్మనాభంగారు మంచం మీద బాసింపట్లు వేసుకుని చేతులు వెనక్కానించుకున్నారు.

"అబ్బాయి, పిల్లలు ఉగాది కొస్తారని ఎదురు చూస్తున్నాం" - సుబ్బాయమ్మగారన్నారు.

"రారుటండి. కెనడా వెళ్ళాలని ప్రోగ్రాం వేసుకున్నారు"

సుబ్బాయమ్మగారు మాట్లాడలేదు. ఆమె మొహంలో నిరాశ కనిపించింది.

"వాళ్ళకేవో పనులుంటాయి. అనుకున్నప్పుడల్లా రావటానికి ఇదేమన్నా రాజమండ్రి, రావులపాలెమూనా?"

క్షణం ఎవ్వరమూ మాట్లాడలేదు.

పాకలో కరెంటు బల్బు ఎర్రబడ్డ కన్నులా ఉంది. దోమలు సంగీత సభ జరుపుతున్నాయి. త్వరగా బయటపడాలి.

నేను కుర్చీలో కదిలాను అసహనంగా. సుబ్బాయమ్మగారు చూశారు. నా పరిస్థితి గమనించారు.

"కాఫీ కలుపుకొస్తాను" అని ఆవిడ లేచి వెళ్ళింది.

"వద్దు" అందామనుకున్నా గాని, నోట్లోంచి మాట రాలేదు, గొంతు తడారిపోయి.

"మీరు అమెరికా వస్తే..."

"వచ్చి?" పద్మనాభంగారు అడిగారు.

"అన్నీ చూడొచ్చు."

"చూసి ఏం చెయ్యాలి?"

నా దగ్గర సమాధానం లేదు.

"కృష్ణా తీరం, అమరేశ్వర ఆలయం - అక్కడకు ఇవి రావుగా. ఏభై ఏళ్ళుగా కృష్ణలో స్నానం, ఉభయ సంధ్యలూ అమరేశ్వర దర్శనం ఇవి లేకుండా ఉండలేను."

పద్మనాభంగారి మొహంలో కళ్లలో ఆవేశం లేదు. నిర్లిప్తత మాత్రమే. లేదా ప్రశాంతత.

"కాఫీ తీసుకో బాబూ!"

తీసుకున్నా, ఇత్తడి గ్లాసు చుర్రుమంది. ఓర్చుకున్నాను.

"పంచదార సరిపోయిందా?"

తలూపాను.

"మాస్టారికి ఇవ్వలేదు" నసిగాను.

సుబ్బాయమ్మగారు నవ్వారు.

"ఆయన ఉదయం తాగుతారు. అంతే! అదయినా నా బలవంతమే! కాఫీ గత ప్రాణిని నేనే."

కాఫీ రుచి తమాషాగా ఉంది. కొంచెం తీపి, కొంచెం వగరు, చిరు చేదు. అసలు కాఫీ ఇలాగే ఉంటుందా? ఏమో నాకు తెలియదు. ఇన్‌స్టెంట్ కాఫీ, అదీ పాకెట్స్‌లో ఉండేది తాగడం అలవాటు. కాఫీ అసలు రుచి, వాసన ఇదే కాబోలు!

"సార్! కారు చుట్టూ పిల్లలంతా చేరి గోల చేస్తున్నారు సార్?"

నాకు దారి చూపించిన కుర్రాడు వచ్చి చెప్పాడు. నేను లేవబోయాను.

"అరేయ్! నువ్వక్కడ ఉండు. పిల్లల్ని దూరంగా ఉండి చూడమను" అని కుర్రాడికి చెప్పి - "మీరు కూర్చోండి. వాళ్ళు ఏం చెయ్యరు. ఊరికే చూసి సంతోషపడతారు." పద్మనాభంగారు చెప్పారు.

"నే వెడతానండి."

"ఏం ఈ రాత్రి ఉండండి."

నేను సందిగ్ధంలో పడ్డాను. ఉండాలా, వెళ్ళాలా? రమేష్ ఇలా వెళ్ళి, అలా వచ్చేస్తే ఏమనుకుంటాడు?

"నాయనా! నిన్ను చూస్తుంటే మా రాముడిని చూస్తున్నట్లుగా ఉంది. వాడెలాగు ఎప్పుడొస్తాడో. ఈ రాత్రి కుండి, అన్నం తిను. రేపు వెళ్ళొచ్చు."

సుబ్బాయమ్మగారు గొంతులో అభ్యర్థన లేదు. తల్లి పిల్లాడిని ఆదేశిస్తున్నట్లుగా ఉంది.

రాత్రంతా గడపాలి ఇక్కడే! ఎలా? కాదని వెళ్ళలేను. ఉండి నరకయాతన పడటం సభ్యతా! సభ్యతకు తలొంచాను!

"వంట చెయ్యి! ఉంటారులే!" పద్మనాభంగారు భార్యను ఆదేశించారు.

ఆ రాత్రికి అక్కడ ఉండక తప్పలేదు.

సూటు విప్పేసి, పద్మనాభంగారిచ్చిన పంచె చుట్టుకున్నాను నడుం దగ్గర. కొయ్య కుర్చీలో ముణగదీసుకు కూర్చున్నా, కాళ్ళు కిందకు చాపితే దోమలు కరిచేస్తున్నాయి. అప్పటికీ యథాశక్తి, ఆయన చూడకుండా దోమలనే చూస్తూ, వాటి బారి నుంచి కాపాడు కుంటూ ఆయన చెప్పే విషయాలు వింటున్నాను.

దొడ్లో తులసి కోట దగ్గర దీపం పెట్టి, సుబ్బాయమ్మగారు పూజ చేసుకుని మాకు వడ్డన చేశారు.

విస్తళ్ళలో అన్నం తినడం నాకు కొత్త అనుభవం. విస్తళ్ళలో పుల్లలు నోట్లో కొస్తాయేమో నన్న భయం. పైగా విస్తరి ఎదురుగా పిల్లి 'మ్యావ్' అంటూ. అదీ ఆ ఇంట్లో మనిషిలాగానే ఉంది!

బీరకాయ కూర, చింతకాయ పచ్చడి, ధనియాల చారు.

"ఇద్దరమే గదా! అందుకే ఏం చేయలేదు. పైగా నువ్వు మా అబ్బాయి లాంటి

వాడివే గదా. పొద్దుపోయింది. నా వంట ఎలా ఉందో! కొంచెం నెయ్యి వేస్తా! పోనీ దబ్బ కాయ ముక్క వెయ్యనా?" - ఇలా సుబ్బాయమ్మగారు పక్కనే పీట వేసుకు కూర్చుని, నా తిండి పరిశీలిస్తున్నారు తల్లిలా.

కారం, ఉప్పు, చింతపండు నా కలవాటు తప్పాయి. నోరు చుర్రుమంది. కళ్ళంబడి నీళ్ళు వచ్చాయి. నీళ్ళు తాగాను. తినాలనిపించింది. బాగానే తిన్నానేమో!

ఆ తరువాత కుక్కి నవారు మంచంలో పడక, ఆరుబయట. చల్లగా గాలి వీస్తున్నా దోమలు కుడుతూనే ఉన్నాయి. పక్క సరిగ్గా కుదరక నిద్ర రాలేదు చాలాసేపు.

సుబ్బాయమ్మగారు కొడుకు, కోడలు, మనవలు, మనవాళ్ళ సంగతులు, విశేషాలు అడిగి తెలుసుకున్నారు.

"కోడలు ఆ మధ్య పెళ్లికి ఇండియా వచ్చిందిట. ఇక్కడ కొస్తుందేమోనని ఎదురు చూశాం. రాలేదు. బెంగుళూరు నుంచి అటే వెళ్ళిపోయింది! మేం వెడదామంటే, దూరా భారం కుదరలేదు. పైగా ఈయనారోగ్యం అంతంత మాత్రం!"

"ఇక్కడ వైద్య సదుపాయాలున్నయ్యా?"

"లేకేం! ఉన్నాయి. కానీ మాకేం పెద్ద రోగాలేం లేవు. కాకపోతే వయసుతోపాటు వచ్చిన జబ్బులే! ఆయనకు ఒక కంటికి శుక్లం వచ్చింది. తీయించాలి. ఆయనేమో నే చెయ్యాల్సిన రాచకార్యాలేమున్నాయిలే! అయినా ఒక కన్ను కనపడుతూనే ఉన్నదిగా అని వస్తాయిస్తున్నారు."

"మీ రెండో అబ్బాయి?"

"పెద్దాడు అమెరికా! చిన్నాడు ఆస్ట్రేలియాలో ఉన్నాడు. వాడూ అంతే! ఎప్పుడో వస్తుంటాడు, చుట్టపు చూపుగా. వాడేమో అక్కడే ఓ అమ్మాయిని చేసుకున్నాడు. ఆ పిల్ల ఇక్కడకు రాలేదు. ఫొటో మాత్రం పంపాడు. ఎప్పుడొచ్చినా ఒక్కడే వస్తాడు"

ఇద్దరు కొడుకులుండి, వాళ్ళు బాగా సంపాయిస్తున్నా వీళ్ళు ఇక్కడెందుకూ ఉండటం! ఉన్న ఊరు వదలలేకనా? లేక అభిమానం అడ్డొస్తున్నదా? ఇదే ప్రశ్న చూచాయగా సుబ్బాయమ్మగారిని అడిగాను.

ఆమె నవ్వింది. పుచ్చ పువ్వులా.

"బీరకాయ పీచు - వాళ్ళ దగ్గర మా కభిమానం ఏమిటి నాయనా! అదేం లేదు. మేం సారపాదు లాంటి వాళ్ళం. వానకు మొలుస్తాయి, పిందెలు కాస్తాయి, పెరుగుతాయి. ఎండాకాలానికి వాడిపోతాయి అంతే! కానీ గులాబీ మొక్కలు ఎండకు, వానకు, గాలికీ పెరగవు కదా! వాటికి పోషణ కావాలి. శ్రద్ధతో పెంచాలి. అప్పుడే అందంగా పూలు పూస్తాయి."

ఎడారిలో వెండి పళ్ళెంలా చంద్రుడున్నాడు. ఊరూ, వాడా, చెట్టూ, చేమా అన్నీ నిద్రిస్తున్నాయి - ఒక్క నేను తప్ప.

నిద్ర రావడం లేదు. కొత్త ప్రదేశం అవడం వల్ల ఆకు కదిలినా, ప్రాణి చప్పుడైనా

భయం, అది పామో, తేలో అని! ఎలుకలు కిచ కిచ లాడినా, పిల్లి అరిచినా, ఆవు మెళ్ళో గంట మ్రోగినా బెరుకు! కుక్క మొరిగితే అదురు. అది పిచ్చికుక్కేమో, వచ్చి కరుస్తుందేమో అని.

భయం ఆ రాత్రి నన్నావహించింది.

ఎందువల్లంటే -

బాగా చిన్నప్పుడు నేను అనాథగా ఉంటే, మేనమామ తీసుకెళ్ళి పట్నంలో పెంచాడు. కాన్వెంటులో చదివించాడు. కన్నకూతురి నిచ్చి పెళ్ళి చేసి, ఇల్లరికం ఉంచుకున్నాడు.

"ఇక్కడ రోగాలు, ఎండలు, ఆకలి, కొట్లాటలు, హత్యలు, మోసం, వంచన.....వద్దు. మీరిద్దరూ వెళ్ళండి, ఈ దేశం వదిలి! హాయిగా అమెరికాలో ఉండండి! డబ్బు నే పంపు తాను!" అని నా మేనమామ చదువు కాగానే నన్ను అమెరికా పంపేశాడు.

అందుకే నాకు ఇండియా అంటే, పులిని చూసినంత భయం. మనుషులను చూస్తే వంటి మీద కాళ్ళజెర్రి పాకుతున్నట్లు ఉంటోంది, అలవాటు లేక!

ఆడ మగ నగ్న దేహాల్లో, ఆకలి కళ్ళతో, నడుస్తున్న పీనుగుల్లా ఉండటం చూస్తే నాకు గాభరా! కానీ వీళ్ళు సొరపాదులా!

ఏమో!

ఎప్పుడు నిద్ర పట్టిందో, ఏమో! మెలకువ వచ్చేసరికి ఎండ చుర్రుమంటున్నది. కళ్ళు మండుతున్నాయి. వళ్లంతా మంటగా ఉంది.

సుబ్బాయమ్మగారు నవ్వుతూ ఎదురుగా ఉంది.

"లే నాయనా! మొహం కడుక్కుంటే కాఫీ ఇస్తాను!" అంది.

దేంతో మొహం కడుక్కోవాలి?

ఉండాలని రాలేదు. కాబట్టి వెంట సరంజామా ఏమీ తేలేదు.

సుబ్బాయమ్మగారే వేపపుల్ల, నీళ్ళు తెచ్చి పెట్టింది. ఆమె చూడకుండా నీళ్ళు పుక్కిలించి, మొహం కడుకున్నట్లు నటించాను.

"మాస్టారేరీ?" కాఫీ తాగుతూ అడిగాను.

"ఆయనా, స్కూలు కెళ్ళారు?"

"ఇంకా ఉద్యోగం చేస్తున్నారా?"

"లేదు నాయనా! రిటైరై పదేళ్ళు పైనే అయింది. అయినా రోజూ స్కూలు కెడతారు. అక్కడి చెట్టు, చేమ, కుర్చీలు, బల్లలు, పిల్లలు, పంతుళ్ళు - అందర్నీ పలకరించి వస్తారు. ఏదైనా పని ఉంటే చేస్తారు."

సుబ్బాయమ్మగారు కూరలు తరుగుతూ చెప్పారు.

"కాలక్షేపం కోసం అన్నమాట!"

"అంతే అనుకో! తెల్లారకుండా కృష్ణ కెళ్ళి గాలీ, వానా, వరదా ఏదొచ్చినా - కృష్ణ

కెళ్ళాల్సిందే. తలార స్నానం చెయ్యాల్సిందే. అది ఆయన అలవాటు. అలాగే గుడికీ నిత్యం వెడతారు. స్కూలుకూ వెడతారు. ఇవన్నీ క్రమం తప్పకుండా జరగాల్సిందే!"

పద్మనాభంగారు రమేష్ చెప్పిందాన్ని బట్టి రైటరు - అంటే ప్యూనూ కాదు, గుమాస్తా కాదు.

"ఆయన కా స్కూలు ప్రాణం బాబూ. గుడి కన్నా ఆరోగ్యం బాగోలేకపోతే వెళ్ళరేమో గానీ, స్కూలుకు వెళ్ళకుండా ఉండలేరు. ఈయనతో పనిచేసిన మేస్టర్లంతా రిటైరై వెళ్ళిపోయినా, ఈయనంటే కొత్త మాస్టర్లకు గూడా గౌరవమే. చేసింది రైటరు ఉద్యోగమే! అయితే ఏం? హెడ్ మాస్టరు దగ్గర్నుంచీ ఈయన మాటంటే కోట్ల కన్నా విలువగా చూస్తారు. అందుకే బాబూ, వచ్చే జీతం తక్కువైనా, ఇద్దరి పిల్లల్నీ అంత చదువులు చదివించగలిగాం!"

నేను డ్రస్ చేసుకుంటుండగా పద్మనాభంగారు వచ్చారు.

"భోజనం చేసి వెళ్ళండి, పొద్దెక్కింది గదా!"

"అవును నాయనా, అన్నీ సిద్ధం చేశా! తినే వెళ్ళు" - సుబ్బాయమ్మగారు భర్త మాటలకు మద్దతు ఇచ్చారు.

"లేదండీ. అసలు రాత్రి వెడదామనుకున్నా."

"రాత్రి ఏం పెట్టానో, నువ్వేం తిన్నావో! నా కసలు తృప్తిగా లేదు. ఈ ఒక్కపూట ఉండి వెళ్ళు. మేమేం పంచభక్ష్య పరమాన్నాలు పెట్టలేం. ఏదో మా కున్నంతలోనే".

మొహమాటం అడ్డొచ్చింది. ఆప్యాయత కాళ్ళకు బంధమైంది.

పద్మనాభంగారితో కృష్ణకు స్నానాని కెళ్ళా. ఓ పక్క గుడ్డలుతుకుతున్నారు. మరో పక్క గేదెల స్నానం! అయినా కృష్ణ నీలంగానే ఉంది.

స్వచ్ఛంగా ఉన్న కృష్ణ నీళ్ళల్లో స్నానం చేస్తే, సేద తీరింది. త్రాణ వచ్చింది. కొత్త ఊపిరి వచ్చింది.

గుళ్ళో కెళ్ళాం.

ముసలి పూజారి నన్ను వింతగా చూసి గోత్రనామాలు అడిగాడు. చెప్పలేకపోయినా, ఆయన ఏదో గొణుక్కున్నాడు. అది మంత్రమో, నా మీద నిందో తెలియదు.

"ఇవన్నీ చాదస్తంగానూ, మూఢాచారంగానూ తోచవచ్చు. కానీ మనం ఎవరమో, మన పూర్వులెవరో గుర్తుండటానికి ఇవన్నీ. విత్తు లేంది చెట్టు లేదు గదా!"

కానీ నేను గులాబీ మొక్కనని ఆయనకు తెలియదు గదా! నే మాట్లాడలేదు.

ఎండ చుర్రుమంటున్నది. గోపురం దగ్గర అరుగు మీద కూర్చుంటే హాయిగా ఉంది, పిల్లగాలికి. అక్కడే, అలాగే పడి నిద్ర పోవాలనిపించింది.

భోజనాలయ్యాక బయలు దేరాను. రమేష్ ఇచ్చిన డబ్బు పద్మనాభంగారికి అందజేశాను.

"ఇంకా కావాలంటే పంపుతానన్నారు!" అని కూడా చెప్పా.

"వద్దని చెప్పు" అన్నారు పద్మనాభంగారు.

"సరిపోతుందా?" సుబ్బాయమ్మగారు ప్రశ్నించారు భర్తని.

"సరిపోతుంది, అయినా సరిపోవటానికి అంతెక్కడా?"

నాకేమీ వాళ్ళ సంభాషణలో అంతరార్థం బోధపడలేదు.

"ఏం లేదు నాయనా! మాస్టారు హైస్కూల్లో ఓ గది కట్టిస్తున్నారు. అబ్బాయి పంపే డబ్బు దానికే వాడుతున్నారు.... మా ఇద్దరికీ ఆయన కొచ్చే పింఛను చాలు!" సుబ్బాయమ్మ గారు చెప్పారు.

నాకు ఏం మాట్లాడాలో తోచలేదు. పద్మనాభంగారి వ్యక్తిత్వం చాలా వింతగానూ, విశేషంగానూ గోచరించింది. ఆయనుండేందుకు సరైన కొంప లేదు. కానీ హైస్కూలులో గది కట్టిస్తున్నారు. రమేష్‌కిది తెలుసా?

"అబ్బాయిని, కోడల్ని, పిల్లల్నీ మరీ మరీ అడిగానని చెప్పు. వీలయితే వచ్చి వెళ్ళ మను!" సుబ్బాయమ్మగారు చెప్పారు.

"పదండి!" పద్మనాభంగారు నాతో ఏమన్నా చెప్పాలనుకున్నారేమో, కారులో ఊరి బయట దాకా వచ్చారు.

వచ్చి, ఊరు దాటగానే, కారు దిగి - "క్షేమంగా వెళ్ళిరా నాయనా!" అన్నారు.

మరెందుకు ఇంతదూరం వచ్చినట్లు. చెప్పటానికి మొహమాట పడ్డారా?

"మీ అబ్బాయికి ఏమన్నా చెప్పమంటారా?"

ఆయన నవ్వారు - "చెప్పేందుకేమీ లేదు. నాకు ఈ సంవత్సరం మారకం ఉంది! అది నిజం కాకపోవచ్చు. నిజం అయితే, అది 'ఏకాకి' అవుతుంది. అలాంటి దేదన్నా జరిగితే.... అంతే. ఇంతకు తప్ప మరేం లేదు. హాయిగా ఉన్నాం అని చెప్పు."

పద్మనాభంగారు వెళ్ళిపోయారు ఊరి వేపు గోపురంలా!

మారకం అంటే - చావు కాబోలు! ఆయన చావు ఆయనకు తెలుసా? తెలిసి, అంత నింపాదిగా ఎలా ఉండగలిగారు?

నాకు ఈ దేశం అర్థం కాదు. ఈ దేశంలోని మనుషులూ అర్థం కారు. వీళ్ళెలా ఇన్ని రోగాల్తో, ఆకలితో, అనారోగ్యంతో, కుళ్ళులో బ్రతుకుతున్నారు?

దేనికోసం బ్రతుకుతున్నారు?

వీళ్ళకు ఆర్తి లేదు. యావ లేదు. జీవితం మీద వాంఛ లేదు. గమ్యం లేదు.

కానీ యుగయుగాలుగా, తరతరాలుగా ఈ దేశం, ఇందులోని మనుష్యులు బ్రతుకు తూనే ఉన్నారు.

ఎలాగ?

ఆలోచిస్తూ, ముందుకు సాగాను, దూరతీరాల వేపు. ●